APTEL/2009/29308


స్నేహిత
# ఎక్స్‌ప్రెస్
నిజం దాగదు.. వార్త ఆగదు
తెలుగు దినపత్రిక

27-02-2026
శుక్రవారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 127
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్
FOLLOW:
https://epaper.expresstelugudaily.com



## రేవంత్ సర్కార్‌పై కేంద్రానికి ఈటల ఫిర్యాదు
2


## కాళేశ్వరానికి మేం అభ్యంతరం చెప్పలేదు..



- నల్లమల సాగర్‌కు తెలంగాణ సహకరించాలి
- సముద్రంలో కలిసే వృథా నీటినే వాడుకుంటాం
- గంగా-కావేరి నదుల అనుసంధానం నా చిరకాల కోరిక
- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

**ఏపీ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరంనల్లమల సాగర్ ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం ఉండదని అసెంబ్లీ వేదికగా సీఎం చంద్రబాబు నాయుడు మిగతా2లో...

## జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు
# మరోసారి పొడిగింపు
ఏప్రిల్ 30 వరకు పొడిగించనున్నట్లు కోర్టుకు తెలిపిన ప్రభుత్వం
2







## 100 నియోజకవర్గాల్లో
# పబ్లిక్ స్కూళ్లు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఈ ఏడాది నుంచే ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. అన్ని సౌకర్యాలూ ఉన్న రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలోనే ఇవి ఉండాలన్నారు. విద్యా శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు.


**కార్పొరేటుకు దీటుగా ..**

కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ప్రభుత్వ పాఠశాలలను లేటెస్ట్ టెక్నాలజీతో, కార్పొరేట్ స్కూళ్ల తరహాలో నిర్మించాలని సీఎం ఆదేశించారు. క్యూర్ పరిధిలో 12 కొత్త ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణమూ ఏడాది లోపు పూర్తి కావాలని చెప్పారు. నగరంలోని మిగతా2లో...

## ఈ ఏడాది నుంచే ప్రారంభిస్తాం
- కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ టెక్నాలజీతో నిర్మాణం
- కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా పబ్లిక్ స్కూళ్లు
- ఏఐ దిశగా చదువును నడిపించాలి
- విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్‌తో పాటు పాలు
- ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు కమిషన్ ఏర్పాటు
- విద్యా శాఖపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

> ప్రైవేట్ స్కూల్స్‌లో నిబంధనలు అతిక్రమించి ఫీజులు వసూలు చేస్తే ఆ పాఠశాల అనుమతి రద్దుతో పాటు ఆ ఫీజు రికవరీ చేసేలా నిబంధన విధించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు సంబంధించి రికమండేషన్స్‌ను ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం విద్యాశాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు.

## తెలంగాణలో భూకంపం
- మంచిర్యాల జిల్లాలో కంపించిన భూమి
- రిక్టర్ స్కేల్‌పై 3.9గా నమోదైన భూకంప తీవ్రత
- తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దులో సైతం భూ ప్రకంపనలు
- భయాందోళనకు గురైన జనం



2



## ఎక్కడైతే ఇళ్లు కూల్చారో అక్కడే
# గృహప్రవేశం చేపిస్తాం
### బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే పక్కా ఇళ్లు నిర్మిస్తాం
- పేదల జోలికొస్తే ఎవరినీ వదిలేది లేదు
- భూనిర్వాసితుల కోసం సుప్రీంకోర్టుకైనా వెళ్తాం
- భూదాన్ భూముల అంశంపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం
- వెలుగుమట్లలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఇళ్ల శిథిలాల మధ్యే నేలపై కూర్చుని బాధితులతో మాటామంతీ

**ఖమ్మం, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న పేదల గుడిసెల తొలగింపు ఘటన రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వెలుగుమట్ల ప్రాంతంలో పర్యటించి బాధితులకు తన సంఘీభావాన్ని ప్రకటించారు. ప్రభుత్వ చర్యల వల్ల నిరాశ్రయులైన పేదల పరిస్థితిని చూసి చలించిన ఆయన.. మిగతా2లో...

## తెలంగాణ నవ నిర్మాణంలో అధికారుల
# పాత్ర అత్యంత కీలకం
- గ్రూప్-1 అధికారులు నిబద్ధతతో పనిచేయాలి
- ఈ గడ్డపై జరిగిన పోరాటాల స్ఫూర్తిని అధికారులు తమ పనితీరులో ప్రతిబింబించాలి
- ప్రతి సంక్షేమ పథకం నిరుపేదలకు చేరడంలో అధికారులదే ప్రధాన బాధ్యత
- తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో కోత
- టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి నియమాకాలు చేశాం
- పారదర్శకంగా నియామకాలు పూర్తి చేశాం: సీఎం రేవంత్ రెడ్డి
- గ్రూప్-1.. గ్రూప్-2 అధికారుల శిక్షణ ముగింపు వేడుకలో పాల్గొన్న ముఖ్యమంత్రి

2



## తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు
- ఒకేసారి 45 మంది ఐఏఎస్‌లు ట్రాన్స్‌ఫర్
- జిల్లా కలెక్టర్లకు కీలక శాఖలు అప్పగింత
- సెక్రటేరియట్‌లో చేసే అధికారులకు స్థాన చలనం
- జిల్లాల్లో నూతన కలెక్టర్లు బాధ్యతలు



2



## రూ.303 కోట్లుతో 14 చెరువుల
# పునరుద్ధరణ
- ప్రతిపాదనలతో సిద్ధమైన హైడ్రా
- కమిషనర్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సర్కార్

2

## కాళేశ్వరానికి మేం అభ్యంతరం చెప్పలేదు..

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. సముద్రంలో వృధాగా కలిసే నీటిని మాత్రమే వినియోగించుకుంటున్నామని వివరించారు. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టుకు తాము ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదని.. అదేవిధంగా నల్లమల సాగర్ విషయంలో పొరుగు రాష్ట్రం సహకరించాలని కోరారు. గంగకావేరి నదుల అనుసంధానం తన చిరకాల కోరిక అని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై జరిగిన చర్చలో ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. రాష్ట్రంలో నీటి సమస్య శాశ్వతంగా తీరాలంటే నదుల అనుసంధానం ఒక్కటే మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వంశధార నుంచి పెన్నా వరకు అనుసంధాన ప్రక్రియ పూర్తి కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ బృహత్తర కార్యం పూర్తయిన తర్వాత తెలుగు తల్లికి జలహారతి ఇస్తామని వ్యాఖ్యానించారు. తన హయాంలో రెండోసారి పుష్కరాలు రాబోతున్నాయని.. వీటిని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటివరకు సాగునీటి ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం రూ. 20 వేల కోట్లు ఖర్చు చేసిందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వెల్లడించారు. రాయలసీమ అభివృద్ధిపై స్పందిస్తూ.. ఆ ప్రాంతం రాళ్లసీమగా మారకుండా దిశానిర్దేశం చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. గాలేరునగరి, తెలుగుగంగ వంటి కీలక ప్రాజెక్టులు ఆయన చొరవతోనే ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. సీమ వాసులకు సాగునీరు అందించిన తర్వాతే చెన్నైకి నీళ్లు తరలించారని వివరించారు. రాష్ట్రంలోని మెజారిటీ ప్రాజెక్టులు గతంలో ఎన్డీయే, ఎన్టీఆర్ హయాంలోనే రూపుదిద్దుకున్నాయని పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి గడువు విధించారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి 14 వారాల సమయం కేటాయించామని.. పురోగతిపై ప్రతి వారం నివేదికలు సమీక్షిస్తానని చెప్పారు. జూలై నాటికి వెలిగొండ ఫేజ్ 1 నుంచి నీళ్లు విడుదల చేస్తామని భరోసా ఇచ్చారు. గత పాలకులు పనులు పెండింగ్‌లో పెట్టి హడావుడి చేశారని విమర్శించారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు.. శ్రీశైలం ద్వారా రాయలసీమకు నీటిని తరలించి రైతాంగాన్ని ఆదుకున్నామని వివరించారు. ఉత్తరాంధ్రలోని 11 ప్రాజెక్టులను ప్రస్తుత పదవీ కాలంలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

**పోలవరం ప్రాజెక్టును ఎమ్మెల్యేలు సందర్శించాలి..**

పోలవరం ప్రాజెక్టును సందర్శించాలని ఎమ్మెల్యేలకు ఆయన సూచించారు. పుష్కరాల కంటే ముందే ఈ ప్రాజెక్టును ప్రారంభించే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరంనల్లమల సాగర్ ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం ఉండదని స్పష్టం చేశారు. సముద్రంలో వృధాగా కలిసే నీటిని మాత్రమే వినియోగించుకుంటున్నామని వివరించారు. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టుకు తాము ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదని.. అదేవిధంగా నల్లమల సాగర్ విషయంలో పొరుగు రాష్ట్రం సహకరించాలని కోరారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ధ్యేయంగా టైమ్ బౌండ్ ప్రోగ్రామ్ పెట్టుకుని ముందుకెళ్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## రేవంత్ సర్కార్‌పై కేంద్రానికి ఈటల ఫిర్యాదు

- పేదల ఇళ్లను కూల్చివేస్తున్న తీరును తప్పుబట్టిన ఎంపీ
- ఖమ్మంలో పేదల ఇళ్లను కూలగొడుతున్నారని ఆవేదన
- మూసీ ప్రక్షాళన పేరుతో వందలాది ఇళ్లను నేలమట్టం
- పెద్దలు కూకట్‌పల్లిలో 120 ఎకరాలు ఆక్రమించినా పట్టించుకోని రేవంత్
- ఢిల్లీ వేదికగా తెలంగాణ సర్కార్‌పై నిప్పులు చెరిగిన ఎంపీ ఈటల


**తెలంగాణ బ్యూరో , స్నేహిత ఎక్స్‌ప్రెస్:** బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఢిల్లీ వేదికగా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న తీరును తప్పుబడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఆయన ఎండగట్టారు. ఖమ్మంలో పేదల ఇళ్లను డీసీఎంలతో సహా పంపి మరీ కూలగొడుతున్నారని ఈటల ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెద్దలు వేల కోట్ల విలువైన భూములను ఆక్రమించుకున్నా పట్టించుకోని ప్రభుత్వం.. కేవలం పేదల ఇళ్లనే లక్ష్యంగా చేసుకుందని విమర్శించారు. ముఖ్యంగా కూకట్‌పల్లి ఎల్లమ్మ బండ వద్ద 120 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనా చర్యలు లేకపోవడాన్ని ఆయన ప్రస్తావించారు. మూసీ ప్రక్షాళన పేరుతో వందలాది ఇళ్లను ఖాళీ చేయించడాన్ని, కూల్చివేయడాన్ని తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. మధు పార్క్ అపార్ట్‌మెంట్ వాసుల ఆవేదన ప్రభుత్వానికి వినిపించడం లేదా అని ప్రశ్నించారు.

**నిత్యావసర ఖర్చులకు నిధులు లేవని.. 5 వేల కోట్లతో గాంధీ పార్క్**

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు, డైట్ చార్జీల వంటి నిత్యావసర ఖర్చులకు నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం.. 5 వేల కోట్లతో గాంధీ పార్క్ కడతామనడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. రక్షణ శాఖ ఇచ్చిన భూముల్లో గాంధీ పార్క్ నిర్మించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా, పేదలకు ఇళ్లు ఇవ్వకపోగా ఉన్న ఇళ్లను పీకేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న 'దుర్మార్గాలను' రాహుల్ గాంధీ వెంటనే గమనించి అడ్డుకోవాలని ఈటల డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ ప్రజలే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. డీపీఆర్లో ఎక్కడా ఇళ్లు కూలుస్తామని చెప్పకుండానే.. క్షేత్రస్థాయిలో పేదలను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. తెలంగాణలో నెలకొన్న ఈ పరిస్థితులన్నింటినీ పూర్తి సమాచారంతో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన ప్రకటించారు.

## తెలంగాణలో భూకంపం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మంచిర్యాల జిల్లా కేంద్రంగా గురువారం భారీ భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఒక్కసారిగా భూమి కంపించడంతో జిల్లా ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భూకంప లేఖిని ప్రకారం దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.9గా నమోదైనట్లు అధికారులు ధృవీకరించారు. భూ అంతర్భాగంలో చోటుచేసుకున్న మార్పుల వల్ల ఈ ప్రకంపనలు సంభవించాయని, వీటి ప్రభావం కొన్ని సెకన్ల పాటు కొనసాగిందని ప్రాథమిక సమాచారం అందుతోంది.కేవలం మంచిర్యాల జిల్లాలోనే కాకుండా, దీని ప్రభావం పక్కనే ఉన్న మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కూడా కనిపించింది. సరిహద్దు గ్రామాల్లో నివసించే ప్రజలు కూడా భూమి ఒక్కసారిగా అదిరినట్లు గుర్తించారు. ఇళ్లలోని సామాన్లు కింద పడటం, కిటికీలు శబ్దం చేయడంతో ఏం జరుగుతుందో తెలియక జనం ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ప్రధానంగా పాత భవనాల్లో ఉన్నవారు మరింత ఆందోళనకు లోనయ్యారు. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ అందించిన వివరాల ప్రకారం, ఈ భూకంప కేంద్రం భూమికి సుమారు పది కిలోమీటర్ల లోతులో కేంద్రీకృతమై ఉంది. గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలోని భౌగోళిక పొరలలో కలిగిన ఒత్తిడి కారణంగా ఇలాంటి స్వల్ప స్థాయి భూకంపాలు సంభవిస్తాయని భూగర్భ శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. అయితే, రిక్టర్ స్కేలుపై 3.9 తీవ్రత అనేది మధ్యస్థమైనది కావడం వల్ల పెద్దగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదని అధికారులు ఊరట వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి పరిస్థితి అదుపులోనే ఉన్నప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక యంత్రాంగం సూచించింది. భూప్రకంపనలు వచ్చిన సమయంలో ఆందోళన చెందకుండా, సురక్షిత ప్రాంతాలకు లేదా ఖాళీ ప్రదేశాలకు వెళ్లాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. భవిష్యత్తులో చిన్నపాటి ఆఫ్టర్ షాక్స్ వచ్చే అవకాశం ఉందేమోనని భూకంప నిపుణులు పర్యవేక్షిస్తున్నారు. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసే పనిలో నిమగ్నమైంది.




# తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణలో భారీగా ఐఏఎస్ ల బదిలీలు చోటు చేసుకున్నాయి. ఏకంగా 45 మంది ఐఏఎస్ లను ప్రభుత్వం ఏకకాలంలో బదిలీ చేసింది. ఈ బదిలీల్లో రాష్ట్ర సచివాలయంలోని కీలక శాఖల నుంచి జిల్లాల కలెక్టర్ల వరకు అనేక మార్పులు జరిగాయి. ఈ మేరకు గురువారం ఉదయం ట్రాన్స్‌పర్ అయిన అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఐఏఎస్ సంజయ్ కుమార్ పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నుంచి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు బదిలీ అయ్యారు. ఐఏఎస్ ఎన్.శ్రీధర్ పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులయ్యారు. అదేవిధంగా ఆయన మైన్స్, జియాలజీ శాఖ బాధ్యతల్లో కూడా కొనసాగుతారు. రాహుల్ బొజ్జ ఇరిగేషన్ శాఖ నుంచి సాధారణ పరిపాలన (రాజకీయ) ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. ఈయనకు బీసీ సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు కూడా కట్టబెట్టారు. ఢిల్లీ తెలంగాణ భవన్ నుంచి ఆర్థిక, ప్రణాళిక శాఖ సెక్రటరీగా ఉన్న గౌరవ్ ఉప్పల్ టీజీఎంసీఐడీసీ ఎండీగా నియమితులయ్యారు. ముషారఫ్ అలీ ఫారూఖీ టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ నుంచి కొత్తగా ఏర్పాటు చేయబోతున్న 3వ డిస్కమ్ సీఎండీగా బదిలీ అయ్యారు. జితేష్ వి.పాటిల్ టీజీఎస్పీడీసీఎల్ కొత్త సీఎండీగా బాధ్యతలు చేపట్టనున్నారు.




**జిల్లా కలెక్టర్లు ఇతర శాఖలకు బదిలీ**

మహబూబ్‌నగర్ కలెక్టర్ ఉన్న బి.విజయేంద్ర తెలంగాణ సాంఘిక సంక్షేమ నివాస విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శిగా, ఎస్సీ అభివృద్ధి కమిషనర్‌గా నియమితులయ్యారు. దివ్య దేవరాజన్ సెర్ప్ సీఈవోగా కొనసాగుతూనే ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. మహబూబాబాద్ కలెక్టర్‌గా ఉన్న అద్వైత్ కుమార్ సింగ్ ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సమన్వయ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా ఉన్న ఎం.హనుమంతరావు నుంచి దేవాదాయ శాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయనకు గోదావరి పుష్కరాల ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. నారాయణపేట కలెక్టర్‌గా ఉన్న సిక్త పట్నాయక్ ఆర్థిక శాఖ స్పెషల్ సెక్రటరీగా వెళ్లనున్నారు. జీహెచ్ఎంసీ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌గా ఉన్న సందీప్ కుమార్ ఝా జనగాం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. కరీంనగర్ కలెక్టర్‌గా పామెలా సత్పతి కార్మిక శాఖ స్పెషల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా ఉన్న అనురాగ్ జయంతి యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. మెదక్ కలెక్టర్‌గా ఉన్న రాహుల్ రాజ్ సహకార శాఖ స్పెషల్ కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీగా ఉన్న భవేష్ మిశ్రా నుండి అదే శాఖలో స్పెషల్ సెక్రటరీగా రీడిజిగ్నేట్ అయ్యారు.

**జిల్లాలకు కొత్తగా వెళ్లే కలెక్టర్లు..**

జనగాం కలెక్టర్‌గా రిజ్వాన్ బాషా షేక్ జోగులాంబ గద్వాల్ కలెక్టర్‌గా వెళ్లనున్నారు. జోగులాంబ గద్వాల్ కలెక్టర్ సంతోష్ బీఎం గిరిజన సంక్షేమ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. వికారాబాద్ కలెక్టర్‌గా ప్రతీక్ జైన్ నారాయణపేట్ కలెక్టర్‌గా నియామితులయ్యారు. హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ మహబూబాబాద్ కలెక్టర్‌గా, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కాత్యాయని దేవి వెళ్లనున్నారు. టీజీఎంఎస్ఐడీసీ ఎండీగా ఫణీంద్రా రెడ్డి నారాయణపేట్ అదనపు కలెక్టర్‌గా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఎటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ఉన్న చైత్ర మిశ్రా నుంచి కరీంనగర్ కలెక్టర్‌గా వెళ్లనున్నారు. ఇక గరీమా అగర్వాల్‌ను రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా నియమించారు. వికారాబాద్ కలెక్టర్ దీపక్ తివారి, మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా అంకిత్, మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా కష్యా గుప్తా, హనుమకొండ కలెక్టర్‌గా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా చాహత్ బాజ్‌పాయ్ అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ అదనపు సీఈఓగా కె.విద్యా సాగర్, ప్రజావాణి అదనపు నోడల్ అధికారిగా నియామకం ఎం.సురేందర్‌కు బాధ్యతలు కట్టబెట్టారు. జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా మందా మకరందు, మెడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్, జీహెచ్ఎంసీ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేశ్ కుమార్ లలిత్ కుమార్, వికారాబాద్ అదనపు కలెక్టర్‌గా ఉమశంకర్ ప్రసాద్, నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్‌గా శ్యామ్ ప్రసాద్ లాల్, మంచిర్యాల అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, వరంగల్ అదనపు కలెక్టర్‌గా వైవీ గణేశ్, సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా అబ్దుల్ హమీద్, నిర్మల్ అదనపు కలెక్టర్‌గా బి.వెంకటేశ్వర్లు, వనపర్తి అదనపు కలెక్టర్‌గా కీమ్యా నాయక్ నియమితులయ్యారు.

# 100 నియోజకవర్గాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు

(మొదటి పేజీ తరువాయి)

భారతీయ విద్యాభవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లలో ఉండే అన్ని వసతులూ వీటిలో ఉండాలన్నారు. క్యూర్‌లో అప్‌గ్రేడ్ చేయనున్న 17 పాఠశాలలు, అదనపు గదులు, ఇతర వసతులు కల్పించనున్న 164 స్కూళ్ల పనుల్లో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో 99 రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాల్లో వారంపాటు విద్యా సంబంధ అంశాలకు కేటాయించాలని సూచించారు.

**ఏఐ దిశగా చదువును నడిపించాలి..**

ప్రస్తుతం ప్రపంచాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శాసిస్తోందని, అందువల్ల పాఠశాల స్థాయి నుంచి ఏఐ బోధనకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏఐపై టీచర్లు, లెక్చరర్లకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఏఐతో వచ్చే అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకునేలా పాఠాలు, బోధన ఉండాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలు, ఏటీసీల్లో కాలం చెల్లిన కోర్సులను తొలగించి, ఏఐ కోర్సులు ప్రారంభించాలని చెప్పారు. ఇవి పూర్తి చేసిన వాళ్లకు వెంటనే ఉపాధి అవకాశాలు లభించేలా చూడాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు నిధులు కేటాయిస్తామన్నారు. ఇప్పటికే ఉస్మానియా వర్సిటీకి రూ.1000 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. మిగతా వర్సిటీలకు ఎంత నిధులు అవసరమనే దానిపై నివేదిక సమర్పించాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డిని సీఎం ఆదేశించారు.

**బ్రేక్ ఫాస్ట్‌తో పాటు పాలు..**

ఈ విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ అమలు చేయాలని సీఎం ఆదేశించారు. దీనిపై అధికారులు, హరేకృష్ణ మిషన్ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. బ్రేక్‌ఫాస్ట్‌తోపాటు ప్రతి విద్యార్థికి పాలు అందించాలని, విజయా డెయిరీ నుంచి పాలను సేకరించాలని ఆదేశించారు. అలాగే, విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పుస్తకాలతో పాటు ఈ ఏడాది నుంచి కిట్ అందజేయాలన్నారు. అందులో స్కూల్ బ్యాగ్, పెన్నులు, పెన్సిళ్లు, షార్పనర్లు, రంగుల పెన్సిళ్లు, జామెట్రీ బాక్సులు, డిక్షనరీ, బూట్లు, సాక్సులు ఉండాలని చెప్పారు. దీనికి కావాల్సిన మొత్తాన్ని బడ్జెట్‌లో పొందుపర్చాలని అధికారులను ఆదేశించారు.

**ఫీజుల నియంత్రణపై..**

ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు సంబంధించి తెలంగాణ ప్రైవేటు పాఠశాలల ఫీజు రెగ్యులేటరీ మానిటరింగ్ కమిషన్ తమ నివేదికలోని అంశాలను సీఎం రేవంత్ రెడ్డికి అందించింది. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలు, తెలంగాణలో తీసుకోవాల్సిన అంశాలను సభ్యులు వివరించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, డీఈవోల నేతృత్వంలో పాఠశాలలను పరిశీలించి, ఫీజుల కట్టడిపై నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్డ్ చీఫ్ సెక్రెటరీ స్థాయిలోని కమిటీ తుది నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. ఫీజు నియంత్రణకు సంబంధించి తల్లిదండ్రులు, మేధావులు, సామాజికవేత్తల అభిప్రాయ సేకరణకు ముసాయిదాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని సీఎం సూచించారు. అనంతరం తెలంగాణ విద్యావిధానంపై తాము రూపొందించిన నివేదికను తెలంగాణ విద్యా కమిషన్ ఆకునూరి మురళి, సభ్యులు సీఎంకు అందజేశారు. వివిధ రాష్ట్రాలు, దేశాల్లో పర్యటించి, అత్యుత్తమ విధానాలు పరిశీలించి వీటిని రూపొందించినట్లు వాళ్లు సీఎంకు వివరించారు.

### తెలంగాణ నవ నిర్మాణంలో అధికారుల పాత్ర

# అత్యంత కీలకం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ రాష్ట్ర నవ నిర్మాణంలో అధికారుల పాత్ర అత్యంత కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరిగిన గ్రూప్ 1.. గ్రూప్ 2 అధికారుల శిక్షణ ముగింపు వేడుకలో ఆయన ప్రసంగించారు. నిన్నటి వరకు విద్యార్థులుగా.. నిరుద్యోగులుగా ఉన్న మీరు నేడు ప్రభుత్వ ప్రతినిధులుగా బాధ్యతలు స్వీకరిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు ఆకలినైనా భరిస్తారు కానీ అవమానాన్ని.. ఆధిపత్యాన్ని సహించరని గుర్తు చేశారు. రాచరికం నుండి ప్రజాస్వామ్యం వరకు ఈ గడ్డపై జరిగిన పోరాటాల స్ఫూర్తిని అధికారులు తమ పనితీరులో ప్రతిబింబించాలని సూచించారు. సమ్మక్కసారలమ్మ.. కొమరం భీం.. చాకలి ఐలమ్మ వంటి వీరుల త్యాగాలను స్మరిస్తూ ప్రజాసేవలో నిమగ్నం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ పథకం క్షేత్రస్థాయిలో నిరుపేదలకు చేరడంలో అధికారులదే ప్రధాన బాధ్యత అని సీఎం పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు.. రేషన్ కార్డు.. ఉచిత విద్యుత్.. రైతు రుణమాఫీ వంటి కార్యక్రమాలకు అధికారులే కళ్లు.. చెవులు అని వ్యాఖ్యానించారు. సచివాలయంలో తాను చేసే నిర్ణయాలు అమలయ్యేది అధికారుల చిత్తశుద్ధి వల్లనే అని స్పష్టం చేశారు. కేవలం ఎనిమిది సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకుంటే గ్రూప్ 1 అధికారులు ఐఏఎస్ హోదా పొందే అవకాశం ఉందని.. ఆ దిశగా కష్టపడి పనిచేయాలని ప్రోత్సహించారు. పనిచేసే చోట ఎస్ఆర్ శంకరన్ వంటి నిజాయితీ గల అధికారులను స్ఫూర్తిగా తీసుకోవాలని హితవు పలికారు.

**తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే జీతం కోత..**

కుటుంబ విలువలపై సీఎం కీలక వ్యాఖ్యలు చేస్తూ తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 10 నుండి 15 శాతం కోత విధించి.. ఆ మొత్తాన్ని నేరుగా తల్లిదండ్రుల ఖాతాల్లో వేసేలా చట్టం తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు. చదువు కోసం ఎంతో కష్టపడిన తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అలాగే అధికారుల శిక్షణ కోసం హార్వర్డ్ యూనివర్సిటీతో ఎంఓయూ కుదుర్చుకోనున్నట్లు వెల్లడించారు.



భవిష్యత్తులో హార్వర్డ్ ప్రతినిధులే హైదరాబాద్ వచ్చి అధికారులకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

**టీజీపీఎస్సీని ప్రక్షాళన చేస్తాం**

నిరుద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి పారదర్శకంగా ఈ నియామకాలు పూర్తి చేశామని సీఎం వివరించారు. లీగల్ చిక్కులను అధిగమించి అభ్యర్థుల పక్షాన ప్రభుత్వం నిలబడి నియామక పత్రాలు అందజేసిందని గుర్తు చేశారు. మెరిట్ ప్రాతిపదికన ఎంపికైన మిమ్మల్ని అధికారులుగా చూడటం తనకు గర్వకారణంగా ఉందని భావోద్వేగానికి లోనయ్యారు. శిక్షణ ముగిసిన నేపథ్యంలో రేపటి నుండి క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉండి బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.

## ఎక్కడైతే ఇళ్లు కూల్చారో అక్కడే గృహప్రవేశం చేపిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో పర్యటించి వారికి భరోసా కల్పించారు. పర్యటనలో భాగంగా కేటీఆర్ కూల్చివేతలకు గురైన ఇళ్ల శిథిలాల మధ్యే నేలపై కూర్చుని బాధితులతో మాట్లాడారు. ఇళ్లు కూల్చివేసిన తీరును, ఆ సమయంలో వారు ఎదుర్కొన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు ఉన్నారని కూడా చూడకుండా ప్రభుత్వం అమానుషంగా వ్యవహరించిందని ఈ సందర్భంగా ఆయన మండిపడ్డారు. భూదాన్ భూముల సమస్యపై బాధితుల తరపున అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాటం చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తామని.. పేదల ఇళ్లను కూల్చిన అధికార పార్టీని నిలదీస్తామని హామీ ఇచ్చారు. 'ఎక్కడైతే ఇళ్లు కూల్చారో, అదే స్థలంలో మళ్ళీ గృహ నిర్మాణాలు చేపట్టి గృహ ప్రవేశాలు చేసేలా బాధ్యత తీసుకుంటాం' అని బాధితులకు మాట ఇచ్చారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే అదే స్థలంలో పక్కా ఇళ్లు కట్టించి ఇస్తామని పేర్కొన్నారు. అనంతరం కేటీఆర్ బాధితులు తాత్కాలికంగా ఆశ్రయం పొందుతున్న అంబేద్కర్ భవన్ పునర్వాస కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. భూదాన్ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికే వరకు బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ పర్యటనతో వెలుగుమట్ల బాధితుల్లో కొత్త ఆశలు చిగురించాయి.

## జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు మరోసారి పొడిగింపు

**తెలంగాణ బ్యూరో , స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులకు సంబంధించిన నిబంధనలు (జీఓ 252, జీఓ 103) సవరణలను సవాలు చేస్తూ తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా అక్రిడిటేషన్ కార్డుల గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగించనున్నట్లు ప్రభుత్వం కోర్టుకు తెలియజేసింది.విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది అడ్వొకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త జీఓల వల్ల జర్నలిస్టుల హక్కులు, సౌకర్యాలకు విఘాతం కలుగుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన స్పెషల్ అడ్వకేట్ జనరల్ జర్నలిస్టులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు తాత్కాలికంగా రెండు నెలల పాటు గడువును పొడిగిస్తున్నట్లు ప్రభుత్వ నిర్ణయాన్ని వివరించారు. ఈ వివరణను రికార్డుల్లోకి తీసుకున్న ధర్మాసనం గడువు పొడిగింపును ధ్రువీకరించింది.ప్రభుత్వ నిబంధనలపై ఉన్న అభ్యంతరాలపై పూర్తి స్థాయి వివరణ సమర్పించాలని హైకోర్టు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆదేశించింది. జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని పేర్కొంటూ, తదుపరి విచారణను నాలుగు వారాల తర్వాతకు వాయిదా వేసింది. ఈ మధ్యంతర ఉత్తర్వులతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అక్రిడిటెడ్ జర్నలిస్టులు ఏప్రిల్ నెలాఖరు వరకు ప్రభుత్వ కార్యక్రమాలు, ఇతర సౌకర్యాలను యథావిధిగా పొందవచ్చు.

## రూ.303 కోట్లుతో 14 చెరువుల పునరుద్ధరణ

**తెలంగాణ బ్యూరో , స్నేహిత ఎక్స్‌ప్రెస్:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కబ్జాలకు గురైన చెరువులను హైడ్రా పునరుద్ధరిస్తున్న సంగతి తెలిసిందే. చరిత్ర పుటల్లో కనుమరుగైన అంబర్ పేట సమీపంలోని బతుకమ్మ కుంటకు ప్రాణం పోసి సిటీలోనే ఆకర్షణీయమైన ప్రదేశంగా తీర్చిదిద్దింది. తద్వారా నగర ప్రజల ప్రశంసలు అందుకుంది. 6 చెరువులే లక్ష్యంగా తొలిదశ పనులు మొదలు పెట్టిన హైడ్రా.. నాలుగు చెరువుల పునరుద్ధరణ చేసి వాటికి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చింది. మరో రెండు చెరువుల పునరుద్ధరణ పనులు తుది దశలో ఉన్నపుడే రెండో దశగా సిటీలోని వివిధ ప్రాంతాల్లోని మరో 14 చెరువులను పునరుద్ధరించేందుకు హైడ్రా సిద్ధమైనట్లు తెలిసింది.హైడ్రా ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటి వరకు 1240 చోట్ల ఆక్రమణలు తొలగించి సుమారు రూ. లక్షల కోట్ల విలువైన 1310 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది. అంతేగాక ఈ కబ్జాల వెనకున్న రాజకీయ నేతలు, బడాబాబులుగా గుట్టును రట్టు చేసింది. అటు చెరువుల పునరద్ధరణ కోసం చేపట్టిన తొలిదశ పనులు పూర్తి కావొస్తుండటంతో రెండో దశ ప్రక్రియ కోసం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. 14 చెరువులను పునరుద్ధరించేందుకు హైడ్రా రూపకల్పన చేసిన ప్రతిపాదనలకు సర్కారు ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఇందుకోసం రూ.303 కోట్లు ఖర్చు చేయనున్నట్లు అంచనాలు ఉన్నాయి. కేవలం చెరువులను పరిరక్షించటం, పునరుద్ధరించటమే గాక స్థానికుల అవసరాలకు తగిన విధంగా వాటిని అభివృద్ధి చేయడం హైడ్రా ఘనతగా చెప్పవచ్చు. రెండో దశ చెరువుల పునరుద్దరణ పనులు ప్రారంభమై వాటిలో సగం చెరువులకు పూర్వ వైభావాన్ని తీసుకువచ్చిన తర్వాత మరి కొన్ని చెరువులను ఎంపిక చేసుకోవాలని కూడా హైడ్రా భావిస్తున్నట్లు సమాచారం.



## ప్రెస్ అకాడమిక్ చైర్మన్ గా రెండు సారి నియమితుడైనా కే.శ్రీనివాస్ రెడ్డికి అభినందనలు



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** జర్నలిస్టు రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న జాతీయ నాయకుడు కే.శ్రీనివాస్ రెడ్డిని రెండోసారి రాష్ట్ర ప్రభుత్వం ప్రెస్ అకాడమీ చైర్మన్ గా శ్రీనివాస్ రెడ్డిని రెండోసారిగా ప్రభుత్వం నియమించినందుకు ఆందోల్ నియోజకవర్గం కేంద్రం మైన జోగిపేటలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం(టీయూడబ్ల్యూజే ఐజేయు) ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని జర్నలిస్టులు అందరూ గురువారం సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా జర్నలిస్టులు టపాకాయలు భారీ ఎత్తున కాలుస్తూ స్వీట్లు పంపిణీ చేస్తూ తామ సంబరాలు జరుపుకున్నారు .జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమిస్తున్న శ్రామికుడు అక్షరము అనే ఆయుధాన్ని చేబుని నవ సమాజ నిర్మాణం కోసం పయనిస్తున్న బాటసారి అటు పత్రిక రంగంలో ఇటు జర్నలిస్టు నాయకుడిగా సమర్థవంతంగా పాత్ర పోషిస్తూ ఎవరికి అన్యాయం జరగకుండా జోడు పాత్రలకు న్యాయం చేస్తూ ముందుకు సాగుతున్నారని కొని యాడారు.రాష్ట్ర మీడియా రంగ అభివృద్ధికి కృషి చేస్తున్న తెలంగాణ రాష్ట్రప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం మరో రెండేళ్ల పాటు పదవి కాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల జర్నలిస్టు సోదరులు సంబరాలు జరుపుకున్నారు. ఇప్పటికే తన పదవి కాలంలో మీడియా రంగానికి సంబంధించి పలు శిక్షణ కార్యక్రమాలు వర్క్ షాపులు సదస్సులు నిర్వహించడంలో శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్ర పోషించారన్నారు. గ్రామీణ జర్నలిస్టుల నైపుణ్యాభివృద్ధి డిజిటల్ మీడియా అవగాహన కార్యక్రమాలు మీడియా నైతిక విలువల పరిరక్షణ వంటి అంశాలలో అకాడమీ చురుకుగా వ్యవహరించిందన్నారు. పదవీకాలం పొడిగింపుతో మీడియా రంగంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు మరింత హూతం లభించిందని భావిస్తున్నాం,రాష్ట్రంలో మీడియా ప్రమాణాలను మెరుగుపరచడం యువ జర్నలిస్టులకు అవకాశాలు కల్పించడం వంటి లక్ష్యాల సాధనకు ఈ నిర్ణయం తోడ్పడఉందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులతో శ్రీనివాస్ రెడ్డి మరో రెండేళ్లు పదవి కాలం పొడిగించినందుకు అందోల్ నియోజకవర్గం ప్రెస్ క్లబ్ పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి,రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకి అందోల్ జర్నలిస్టు పక్షానప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాం..ఈ కార్యక్రమంలో ఆందోల్ నియోజకవర్గం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కనకంటిభూమయ్య ,రాష్ట్ర సోషల్ మీడియా ప్రచార కమిటీ సభ్యులు మునిపల్లి యాదగిరి జిల్లా కార్యదర్శి ఆనంద్ వర్ధన్ ఐజేయుమాజీ సభ్యులు వెంకట్ రెడ్డి,అందోల్ నియోజకవర్గంలోని ఆయా మండలాలజర్నలిస్టులు, రాజేందర్,ఆర్ఏ సత్యం,అశోక్, సుమన్,ధనంజయ్,జైపాల్,రాథోడ్ వెంకటేష్,రాజు ,హజ్మత్,కృష్ణ ,శేఖర్, హర్షద్,శంకర్,రాజ్ కుమార్,పల్లె గడ్డ రాజు శ్రీశైలం,దాసు,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి వినతి



**మొయినాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం మొయినాబాద్‌లోని అంజన్న గార్డెన్‌లో చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సమితి నాయకులు దివ్యాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా పెన్షన్లు, ఉపాధి అవకాశాలు, వైద్య సదుపాయాలు, విద్యా సౌకర్యాలు తదితర అంశాలపై చర్చించారు. అర్హులైన ప్రతి దివ్యాంగునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సిములు, జిల్లా అధ్యక్షులు పోతురాజు సుధీర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హరిజన్ బాల్ రాజ్, మహేష్, వివిధ మండలాల నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.దివ్యాంగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీ హామీ ఇచ్చినట్లు సమితి ప్రతినిధులు తెలిపారు.

## ఘనంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలను బిజేపి మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు ఘనంగా నిర్వహించారు.గురువారము నాడు మోమిన్ పేట్ మండల నాయకులతో కలిసి మన ప్రియతమ నాయకులు చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జన్మదిన సందర్భంగా మోమిన్ పేట్ మండల అధ్యక్షుడు ఆశి రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులతో కలిసి వారిని గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రమేష్ రాఘవేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి,రంగారెడ్డి,పరుశురాం, బీజేవైఎం జిల్లా ఆర్టిఐ కన్వినర్ రఘునాథ్ రెడ్డి,రాళ్లగుడపల్లి సర్పంచ్ వర్థ్య మహిపాల్,కార్యకర్తలు సాయిరాం, నాగేష్,రమేష్,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## మోమిన్ పేట్ లో విషాదం..గుండెపోటుతో మృతి




**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మోమిన్ పేట్ బస్టాండ్ సమీపంలో గురువారం నాడు విషాదకర సంఘటన జరిగింది. బూరుగుపల్లి గ్రామానికి చెందిన మన్నే కిష్టమ్మ (55) పని నిమిత్తం మోమిన్ పేట్ వచ్చింది.తిరుగు ప్రయాణంలో తన గ్రామానికి వెళ్లేందుకు బస్సు కోసం వేచి చూస్తున్న సమయంలో ఆమె అస్వస్థతకు గురై కూర్చున్న చోటే ఇబ్బంది పడుతూ గుండెపోటుతో మృతి చెందింది. కళ్ళముందే ఓ మహిళ ప్రాణాలు పోతుంటే తోటి ప్రయాణికులు దిగ్భ్రాంతి కి గురయ్యారు.



Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com